



# పదికొచ్చినాం ప్యాంట్లు తొడిగినాం

డుగ్‌డుగ్ మోటారు ఎనక కూచుని డుర్రుమంటా పోతా నా తట్టు చూసి చెయ్యూపేసి పోయినాడు కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు. వాడి మొకం చిచ్చుబుడ్డిలాగ ఎలిగిపోతా ఉంది. బుజాలు ఎగరతా ఉన్నాయి హుషారుకి.

'పోరా పో. పోతే పో' అనుకున్నాను కచ్చగా అది చూసి.

నాకు తెలుసు వాడు వాళ్ల నాయనతో కలిసి యాడికి పోతా ఉన్నాడో. గుడ్డలు కొనుక్కునేదానికి. ఒట్టి గుడ్డలు కాదు. ప్యాంట్లు కొనుక్కునేదానికి.

'ఇయ్యాల నేను త్రీ ఫోర్ ప్యాంట్లు కొనుక్కుంటాను మావా' అని వాడు ఇదివరకే డిక్లేరు చేసేసున్నాడు మా ఇస్కూల్లో.

కారణం. మా కుమారస్వామి ఐవోరు.

మేమంతా పదో కిలాసులోకి వొచ్చేశామనీ ఏందో కొంపలు అంటుకు పొయ్యాయనీ ఆయన మా ఇస్కూలు స్టార్టింగ్ డే రోజున ఒక్కొక్క సెక్షనులో ఒక్కొక్క గెంట లెక్కన వాయించి వొదలిపెట్టినాడు అందరినీ.

'ఒరే. ఇప్పుడు మీరు ఎవరనుకుంటా ఉన్నారు? మామూలు పిలకాయలా? కాదు. పదో కిలాసు పిలకాయలు. ఇంక మీకు బరువు పెరిగింది. బాధ్యత నెత్తిన పడింది. మీ అమ్మలు నాయనలు కంటా ఉన్న కలల్ని మీరు నిజం చెయ్యబోయేది ఇదిగో ఈ కిలాసు లోనే. బాగ చదివినారో- పైకి పోతారు. బాగ చదవలేదో- కిందకి పడతారు. ఒకటి గుర్తు పెట్టుకోండి. ఒకసారి టెన్తు తప్పినవాడు మళ్లా టెన్తు పాసుకావడం బలే కష్టం. ఆ ఏముందిలే సెప్టెంబరు ఉళ్లేదా? అది పొయ్యాక మార్చి ఉళ్లేదా? అని అనుకుంటా ఉన్నా రేమో. అనుబవం మీద చెప్తా ఉన్నా. సెప్టెంబరు పిలకాయలు అనంగానే పేపర్లు దిద్దే ఐవోర్లు కూడా కుడి చేతికి బదులు ఎడం చెయ్యి వాడతారు. అంత అమర్యాద. కాబట్టి ఏక్ దమ్మున అన్ని సబ్జెక్టులు పాస్ అయ్యేటట్టుగా ఇప్పటి నుంచే చదవండి. ఈ ఇస్కూలు పేరు నిలబెట్టండి. మీ పేరే ఇస్కూలు పేరు. ఇస్కూలు పేరే మీ పేరని గుర్తుపెట్టుకోండి' అని కళ్లద్దాలు తీసి కుడిచేతిలో పట్టుకున్నాడాయన.

ఇంక కళ్లు తడి తడిగా చేసుకుంటాడో ఏం పాడో అని అందరం ఎందుకైనా మంచిదని గబగబా చప్పట్లు కొట్టినాం.

'చప్పట్లు మీరు గొట్టడం కాదు. మీరు బాగ ప్యాసయితే నేను కొడతా చప్పట్లు. నేనే గాదు ఐవోర్లంతా కొడతాం. ఇంకా ఇనండి. ఇప్పుడు మీరు పెద్ద పిలకాయలు అయిపో యున్నారు. మీసాలు గీసాలు రాబోతా ఉంటాయి. ఇంక మీరు తొడలు గిడలు అవు పించేలాగా చెడ్డీలు గిడ్డీలు తొడగబాకండి. ఇళ్లల్లో చెప్పి ప్యాంట్లు కొనుక్కోండి. మీకు డ్రాయర్లు కూడా చెప్పాలి కర్మ. మామూలుగా చిన్నప్పటాల్నించి అవి యిడవకుండా వాడాలి. కానీ మనపక్క పదో కిలాసుకి వొచ్చినా ఇంట్లోవాళ్లు పిలకాయలకి డ్రాయర్లు కొనిపెట్టరు. నేను చెప్పానని చెప్పి అవి కూడా తీసుకోండి. వీలైతే బనీన్లు కొనుక్కోండి. చెప్పులు కొనుక్కోలేనోళ్లు అద్వానమైనా సరే లబ్బరు చెప్పులన్నా కొనుక్కోండి. ఉత్త కాళ్లతో రాబాకండి. మొత్తం మీద చెప్పేది ఏందిరా అనంటే... ఇది టెన్తు కిలాసు గాబట్టి నీటుగా ఉండండి. విష్ యు గుడ్‌లక్కు. శుబం' అనేసి పక్క సెక్షనుకి ఎళ్లిపోయినాడు.

ఆయన ఎళ్లాక, ఆయన చెప్పిన మొదటి పారాలోని మాటలకి పెద్దగా హీరింగు జరగ లేదుగానీ రెండో పారాలోని మాటలకి మాత్రం పిలకాయల్లో తుపానుగొట్టింది.

'ప్యాంట్లేందిరా ప్యాంట్లు. కుమారస్వామి ఐవోరు బలే చెబుతాడుగానీ. అసలికే ఉన్న చెడ్డీ ఊడగొట్టి గోసీ పెట్టి గొడ్లకాడికి పంపిస్తానంటా ఉన్నాడు మా నాయనా. ఇంక ఇంటి కాడికి పొయ్యి ప్యాంట్లన్నామంటే కట్టె తీసుకొని నెత్తి పగలగొడతాడు. గ్యారంటీ' అన్నాడొ కడు పాపం సంక్షేమ హాస్టలువాడు.

'నీ సంగతి అట్ట పెట్టరా. నా సంగతి ఏంది? ఈ కాళ్లకి ఏనాడైనా చెప్పులు తొడిగి నానా? ఇన్ని రోజులుగా తిరగతా ఉన్నానే ఒకనాడైనా ముల్లు దిగిందనో మేకు దిగబ డిందనో చెప్పానా? అసలికి నాకు చెప్పులే అలవాటు లేవురా. తొడిగితే నడకే రాదురా. కుమారస్వామి ఐవోరు మరీ బలవంతం చేస్తే ఆ కర్మకాలిన చెప్పులు తొడుక్కుని చక్రాల కుర్చీలో కూచుని రావలసిందేరా బడికి' అన్నాడు ఇంకో సంక్షేమ హాస్టలు వాడు.

'చెప్పులూ ప్యాంట్లూ అంటే ఏమోగానీ మావా కట్‌డ్రాయరు అనంటే మాత్రం బలే కష్టంరా. ఒకసారి నెల్లూరు నుంచి మా మేనత్త కొడుకొచ్చినప్పుడు ఏందోలే చూద్దాం

అనేసి వాడిది తొడిగి చూశా. అంతే. కింద తొడిగితే పైన గత్ అంటా గొంతు పట్టేసుకు నింది. ఊపిరే ఆళ్లా. వాటిని తొడుక్కుని తిరగడం బలే కష్టం స్వామీ. అదే పెద్ద దిగులుగా ఉంది' అని మొకం ఏలాడేశాడు మరొకడు.

కందుల మాలకొండరావుగాడూ కాండూరి మురళీగాడూ నేనూ ఏం మాట్లాడలా. ఇంటర్‌బెల్లులో బి సెక్షనుకాడికెళ్లి శ్రీదరుగాడితో మాట్లాడితేగానీ యీటన్నింటి మీదా మాకొక ఐడియా రాదని వాణ్ణి పొయ్యి కలిసినాం.

'ఒస్. అదెంత పనిరా. ఇయ్యాలే త్రీఫోర్ ప్యాంట్స్ మా నాయనతో చెప్పి తీసుకుంటా నురా' అన్నాడు వాడు తేలిగ్గా.

మాకు మండింది.

'నీకేమీరా. మీ నాయన కాడ కరెంటు స్తంబాల లిబ్బి మూలగతా ఉంది... త్రీ ఫోర్ కాకపోతే తర్టీన్ ఫోర్టీన్ తీసుకుంటావు. మా సంగతి ఏందిరా' అన్నాను నేను.

'ఏంది ఏందిరా?' అన్నాడు వాడు.

మురళీగాడు అందుకున్నాడు.

'అదికాదురా. మా నాయన గుంటూరులో ఉన్నాడు గదరా. ఆయన నన్ను చూడ్డాని కొచ్చినప్పుడు, ఈ సంగతి చెప్పినప్పుడు, ఆయనకి మూడు బాగుండి సరే అని అన్నప్పు డు పోయి తీసుకోవాల్సిందేగానీ మా తాతయ్యతో చెప్పి కొనలేమురా. అసలికి ఈ చెడ్డీ చొక్కా ఏంది, వైష్ణవుల పిల్లోడు హాయిగా దోవతీ గట్టుకొని నిలువునామాలు పెట్టుకొని బడికిపోవాలిగానీ అనేది మా తాతయ్య తత్వంరా' అన్నాడు వాడు దిగులుగా.

'నీ సంగతేందిరా?' అన్నాము కందుల మాలకొండరావుగాడితో.

'మా నాయన నేను ఏమి అడిగినా కాదనడుగానీ కట్ట మీది చినమౌలాతోనేరా నా ప్రాబ్లము. మా నాయనకు ఆ టైలరు మీదే గురి. మొన్న తీసకెళ్లి చెడ్డీలు కుట్టిస్తే చూశా రుగా పోలీసోళ్ల చెడ్డీల్లాగా అన్యాలంగా కుట్టిచ్చిచ్చాడు. ఇంక ప్యాంట్లు కూడా ఆణ్ణే కుట్టి స్తానంటే అయి తొడుక్కొని యీదులు చిమ్మతా నడవడం తప్పితే ఒక సోకు ఒక సంబరం ఉండవురా. నాకొక మంచి టైలరు ఉంటే బాగుండునురా' అన్నాడు వాడు.

'మంచి టైలరంటే బాంబే టైలర్సు బక్షుసాయెబురా. ఆయన మా నాయన ఫ్రెండు. ప్యాంట్లు బలే కుడతాడు. కానీ ఏం లాబం. నీకాడ గుడ్డ ఉంది. కుట్టడానికి టైలరు లేడు. నాకు టైలరు ఉన్నాడు కుట్టడానికి గుడ్డ లేదు. చూసినావా దైవలీల' అన్నాను నేను యీలై నంత బరువుగా.

ఆ సాయంత్రం అందరం మాట్లాడుకుంటా ఇళ్లకు వచ్చినాం. వొచ్చిన కాసేపటికే శ్రీదరుగాడు వాళ్ల నాయన్ను తీసుకొని బజారుకు పొయ్యాడు ప్యాంట్లకి.

రాత్రయ్యింది. మా నాయన అంగడి కాణ్ణుంచి వచ్చి, ఒంటి మీద ఉడుకునీళ్లు బోసు కొని, దేవుడా అంటా స్తిమితంగా అన్నం ముందు కూచున్నాక నెమ్మదిగా కదలేశా ప్యాంట్ల సంగతి.

ఆ మాట ఎత్తానో లేదో 'ఏందా?' అంది మా అమ్మ.

'ప్యాంట్లూ'... అని నసగతా ఉంటే, అడ్డం పడి 'సంకనేసి పిసికితే కీసుమంటా ఒక్క

దెబ్బకి చస్తావుగానీ నీకెందుకు నాయనా ప్యాంట్లూ? అయ్యన్నీ ఎద్దుల్లాగా బలిసిన పిలకాయలకి. నువ్వు బక్కోడివి. హాయిగా చెడ్డీలే తొడుక్కో.. బాగుంటావు' అని తేలగొట్టెయ్యబోయింది.

నేను పడనీలా.

'బక్కోడా ఎద్దోడా అనేది కాదు పాయింటు... పదికొచ్చినోళ్లంతా ప్యాంట్లే తొడగాలని కుమారస్వామి ఐవోరు చెప్పాడు' అన్నాను.

'పోనీలేరా. నేనొచ్చి చెబుతానులే ఐవోరికి మావోడికాడ ప్యాంట్లు లేవు, చెడ్డీలే ఏసుకొస్తాడని' అన్నాడు మా నాయన.

నాకర్ధమైపోయింది, యింకిది జరిగే పని కాదని.

'అయితే కొనిచ్చరన్నమాట?' అన్నాను లేచి నిలబడతా.

'ఏందిరా అంతా చూస్తానే ఉంటావు, మాట్లాడతానే ఉంటావు? పొద్దన నిద్రకళ్లతో చూశావుగదా పాలుబోసే బుజ్జమ్మ వొచ్చి పాతిక రూపాయల పాలడబ్బుల కోసం ఎంత రచ్చ చేసి పొయ్యిందో. ఉంటే మొకాన కొట్టుండేవాళ్లంగానీ అన్ని మాటలు పడుండేవాళ్లమా? అసలే అన్‌సీజను. పనుల్లేవు. డబ్బుల్లేవు. ప్యాంట్లు యాణ్ణుంచి వొస్తాయా. అందరం కలిసి ఆ వాటాన మీ నాయన మీద పడితే ఆ మనిషి ఉండనా?... ఇప్పుడే వొస్తా అనేసి ఇంట్లో నుంచి పారిపోనా?' అంది మా అమ్మ.

'అయ్యన్నీ నాకు తెలవదు. ఇప్పించారో సరే సరి. లాకుంటే మా ఇస్కూలు చుట్టుపక్కల యాడా నీళ్లు లేని బావులు లేవు. అయినాగానీ ఎంత దూరమైనా సరే పొయ్యి అట్టాంటి బాయి చూసుకొని దబీ మని దూకి చస్తా' అని, పొయ్యి మా నాయనమ్మ పక్కలో బోర్లా పొణుకున్నాను.

కాసేపటి మా అమ్మ వొచ్చి, ఎప్పుడూ లేంది నా యీపు మీద దయగా చెయ్యేసి నిమరతా 'సరేలేరా. నిన్నెందుకు కాదనలా. మీ నాయన పాత ప్యాంట్లు రెండున్నాయి. పోయి బక్షు సాయెబుకిచ్చి ఆల్ట్రేషను చేయించుకో' అంది.

నేను మొకం బోర్లానే ఉంచి 'నాక్కావలిసింది ఏ రంగు ప్యాంట్లంటే ఆ రంగు ప్యాంట్లు కాదు. ఖాకీ ప్యాంట్లు. యూనిఫారానికి' అన్నాను.

నా మొండికి మా అమ్మకి కోపం వచ్చేసింది.

'సరే చావు. నీ మాటే కానిచ్చుకొని చావు' అనేసి అంతటితో తాళలాకా నిమరతా ఉన్న చేత్తోనే దబీ మని వీపు మీద ఒక్కటి బాది మా నాయన కాడికి ఎళ్లిపోయింది.

ఆ దెబ్బకి చురుకు అదిరిపోయిందిగానీ మరుసటి రోజుకే నా ఒళ్లో రెండు ఖాకీ ప్యాంటు గుడ్డలు, రెండు తెల్ల చొక్కా గుడ్డలు వచ్చిపడ్డాయి. వాటిని జాగ్రత్తగా వైరుబుట్టలో పెట్టుకొని మా నాయన చెయ్యి పట్టుకొని బక్షు సాయెబు కాడికి ఎళ్లినాను. ఎళ్లనైతే ఎళ్లినానుగానీ నా బయాలు నాకున్నాయి. అందుకని ముందే మా నాయనకు చెప్పేశాను, ప్యాంట్లు ఏ మాడల్లో గావాలో.

'బక్షు భాయ్. ఈడికెదో కొత్త మాడల్లో కావాలంటయ్యా ప్యాంట్లూ. పిల్లోడు గదా. తిట్టకుండా పాపం ఎట్ట కావాలో యిను' అన్నాడు మా నాయన, బక్షుభాయ్‌తో.

'ఏమిరా చిన్న కరీంసా. నీకు మాడలుగావాలా? ఏం మాడలురా?' అన్నాడు బక్షుసా యెబు నవ్వతా.

'బెల్లు' అన్నాను నేను.

'ఆల్‌రైట్. ఎంత పెట్టేది?' అన్నాడు టేపు అందుకుంటా.

'ఏసుకుంటే పాదం మునిగిపోవాల' అన్నాను.

'ఇంకా?'

'బెల్లుకి కింద జిప్పు. పైన రెండు సైడు పాకెట్లు. ఎనక రెండు బాక్ పాకెట్లు. ఒక సీక్రెటు పాకెట్టు. బెల్టు కట్టుకునేదానికి ఎగస్ట్రా పిల్టులు. ఒకటి వేటగాడులో ఎన్టీఆర్ ప్యాంటులాగా, ఒకటి డాన్‌లో అమితాబచను ప్యాంటులాగా'....

టప్‌మంటా నెత్తి మీద ఒక్కటేశాడు బక్షుసాయెబు చెక్క స్టేలుతో.

'అదనప్రసంగీ. ఇస్కూలికి పోతా ఉన్నావా? సినిమాల్లో చేరతా ఉన్నావా? పో. ఏదో ఒకటి కుడతాపో' అని నేను అంతజాగ్రత్తగా తీసుకొచ్చిన ఆ గుడ్డల్ని ఉండ కట్టి ఎత్తి మూలపారేశాడు.

ఇది జరిగిన ఒకటి రెండు వారాల్లోనే మా ఇస్కూల్లో ముక్కాలు వొంతు పిలకాయల ఒంటి మీదికి ప్యాంట్లూ చొక్కాలూ వొచ్చేశాయి. అంటే ఇంచుమించుగా అందరం జీవితంలో ఒకేసారి చెడ్డీలు వొదిలేసి ప్యాంట్లలోకి మారిపోయినాం.

ఆ ఫస్టుటైము సంతోషంలో, ఆ ఫస్టుటైము సంబరంలో లోపల డ్రాయరు ఉన్నా లాకపోయినా ఒకడు టక్కు, ఒకడు టక్కిస్కు టయ్యి, ఒకడు టక్కు వితవుట్ చెప్పుల్స్, ఒకడు టక్కు విత్ మొల్‌తాడ్...

అబ్బా. ఆ కళ వర్ణించతరమా.

మేము మొగోళ్ళమైన ఆ నిమిషాలను మరువతరమా?

■